
# గి.న.భా.లు-4



టైటిల్ మార్చేశావేవిట్రా గిరీ అంటున్నారా? చిత్తం. పొదుపండి. దేశమంతా ఇదే ఫాషను. గిరీశం నమస్కార భాణాలూ అంటూ పెద పేద్ద అక్షరాలతో హెడ్డింగు అచ్చు వెయ్యడం వల్ల ఎంత చోటు వేస్టవుతోందీ అంటూ శ్రీ పొదుపు కమీషన్ వారు కోప్పడి పైవిధంగా సూచించారు పొడక్షరాలతో సర్దుకోవలసిందని. వారు అమెరికా, ఆఫ్రికా, ఆసియా ఖండాలన్నీ పర్యటించి, పరిశీలించి, పరిశోధించి పై తీర్పు చెప్పారు. ఆ టైటిల్ కన్నా నా సంజాయిషీయే ఎక్కువచోటు ఆక్రమించిందీ అంటారా అలాక్కానీండి. తమలాటి గిట్టని వాళ్ళకి మేవేం జేసినా నచ్చదు మరి. రూల్సంటూ పెట్టాక వాటిని శిరసావహించాలి గద! హు!

మెన్న ఒహ పేద్ద పబ్లిక్ కార్పొరేషన్‌కి ఛైర్మనుగా ఒక వాసుదేవరావుగార్ని వేశారు. మరి వారికి ఢిల్లీలో బస కావాలి కదా? ఆ కార్పొరేషన్ రూల్సు ప్రకారం ఛైర్మన్‌గారికి ఇంటద్దె క్రింద రూ.5,500/- కన్నా ఒక దమ్మిడీ ఎక్కువ ఇవ్వరాదు. ఢిల్లీ అంతా వాకబు చేసినా వారి ఫాయాకి తగిన ఇళ్ళు పాతిక వేలకి లోపు లేవు. ఇటు రూల్సు చూస్తే అయిదున్నర వేలు దాటరాదు. ఈ సంకట స్థితిలో కొంప దొరికేదాకా ఛైర్మన్ గారినెక్కడ

పెట్టాలా అని బుర్రలు బద్దలు కొట్టుకుని అందాకా అశోకా హోటల్‌లో వుంచుదామన్నారు. అశోకా కూడా సర్కారు ఇలాకా లోదే. సిస్టరు సంస్థ.... అక్కడ ఒక స్వీటుకి 3 వేల అద్దెట.....ఒక స్వీటు అంటే రెండు బెడ్రూములూ రెండు డ్రాయింగు రూములూ, నాలుగు బాతురూములూ, ఒక దొడ్డిదారీ, ఒక చిన్న డాబా వుంటాయి. రెండు స్వీట్లు తీసుకొంటామని బేరం పెట్టి రెండు మూళ్ళారు వేలనీ రూల్సు ప్రకారం ఐదున్నరకు కుదించి ఒప్పించారు. కాపోతే ఒక్కటే చిన్న తేడా. రూల్సు ప్రకారం ఇంటద్దె నెలకి అయిదున్నర -- హోటలు రూల్సు ప్రకారం రోజుకి అయిదున్నర....రూల్సు ప్రకారం అయిదున్నర అన్న ఫిగరే ముఖ్యం. నెలా, రోజా, గంటా అన్నది కాదు. ఈ విధంగా ఛైర్మన్‌గారి బసకు నెలసరి అద్దె లక్షా అరవయ్యయిదు వేలూ సోడాలూ బీడాల ఖర్చు (భోజనంలో రాయకూడదు రూల్సు ప్రకారం) మరొక నలభై వేలూ ..... వెరసి రెండు లక్షలు అయింది. రేపు పియ్యేసీ వాళ్ళు కోప్పడినా - పిచ్చివాళ్ళలారా అది దుబారా కాదు - రూల్సు ప్రకారం ఇంటద్దెకు గాను ఇవ్వాల్సిన అయిదున్నర వేలూ ప్రభుత్వానికి మిగులే గదా అజ్ఞానుకోరేం అని ఠంగున జవాబివ్వచ్చు.

అయినా గిట్టని వాళ్ళు ప్రభుత్వాన్ని కోప్పడుతూ పేపర్లో రాసి పారేశారు. వాళ్ళ మొహం. దెయిర్ ఫేస్! వాళ్ళలాగే మీరు కూడా ఇది తప్పంటారా? అంటే - జాన్ మేజర్ 10, డౌనింగ్ స్ట్రీటు ఇంటిని మేగీథాచర్‌కు అద్దెకిచ్చినంత ఒట్టు! అది విని పీవీజీ నవ్వినంత ఒట్టు!

* * *

తమ దయవల్ల కన్యాశుల్కంలాగె వరశుల్కం కూడా చుక్క శల్యమైనా బతికి బట్టగట్టే మారు వేషంలో తిరుగుతోంది.

ఈమధ్య ఓ మంత్రిగారూ, షావుగారూ (షావుకారు గారుకి పొదుపు రూపం) వియ్యమందాలనుకున్నారు.

నేను చచ్చినా కట్నం ఇవ్వను. మా తాతగారు మంత్రి అయినప్పట్నించీ పబ్లికున కమిటై పోయా అన్నారు మంత్రిగారు.

కట్నం లేపోతే నేను చచ్చినా పెళ్ళి కొప్పుకోను. ఇది తరతరాలుగా మా వంశాచారం అన్నారు షావుగారు.

మంత్రిగారు నవ్వేశారు. కట్నం అంటే కాషే గదయ్యా అది నేనిస్తే నేం - నాసేవలు పొంది నాకు రుణపడ్డ నా ప్రజలిస్తేనేం అన్నారు....

అంటే చందాలు పోగేస్తారా ఛీ .... అన్నారు షావుగారు.

అలాగ్గాదయ్యా, నేను అల్లుడి కంట్రోల్లో వుండేలా -- రెండు మెడికల్ సీట్లు, రెండు డెంటల్, ఒక మెంటల్ సీటూ కేటాయిస్తాను. మీరు రొక్కంగా ఫిరాయించుకోవచ్చు.

రెండు మెడికల్ అంటే ఏడెనిమిది లక్షలనుకుందాం, డెంటల్ రెండంటే నాలుగూ కాని -- మెంటల్ సీటుకేమొచ్చి చస్తుందీ పిచ్చాసుపత్రేగా-- అన్నారు షావుగారు.

షావుగార్లయి వుండే తమరలా అనడం ఆశ్చర్యంగా వుంది .... మెంటల్ అంటే నా అర్థం ఒక మనిషికి పిచ్చెక్కిందా లేదా అని తీర్పు చెప్పే ఫైనల్ అధికారం. దివాళా పెట్టదలచుకున్న కోటేశ్వరుడు -- ఆ సర్టిఫికేట్‌కి పాతిక లకారాలైనా ఇస్తాడు. అలాగే సుబ్బరంగా వున్న ఓ కోటేశ్వరుడి విడోని లోపలికి తోయించాలంటే -- సగానికి సగమిస్తారు బేవారసులు. ఇదంతా అల్లుడిగారి అదృష్టమే గదా అన్నారు మంత్రిగారు

షావుగారు గంభీరంగా తలవూపారు సంతోషం పైకి చిందకుండా. అది సరే .... మరి అత్తగారూ ఆడపడుచుల లాంఛనాలూ? అన్నారు.

ఆడపడుచులు నలుగురున్నారుగా. అక్కగారితో కలిపి అయిదుగురు. వాళ్ళలో వాళ్ళని ఎలాగేనా సర్దుకోమనండి. నేనిచ్చేవి ఈ క్రింది ఫవర్సులు. రెండు ఎస్సై వుద్యోగాలూ, రెండు చెక్ పోస్టులూ, రెండు సీటీవో పోస్టులు వాటి బదిలీ పవర్సులూ నాలుగు టీచర్లు - అందులో రెండు జెంట్సులూ రెండు లేడీసులూను.

అబ్బో ఇది భలే అన్నారు షావుగారు ఆనందంతో .... బదిలీల పేరు జెప్పి జంటల్ని చెరో వూరికీ వేసి విడదీస్తానని భయపెట్టచ్చు. ఒక్క వూళ్ళోనే వుండనిస్తానని ఆశ పెట్టచ్చు. చక్కగా వుంది .... పూర్వం ఆవులూ గేదెలూ ఇచ్చేవారు. అవేముంది పాలిస్తాయి. పేడేస్తాయి. .... అబ్బో ఇది బెమ్మాండం. వీళ్ళకే ఇలా ఇచ్చారు‹ ఇహ మీ వియ్యపురాలికే‹ విస్తారో.

అమ్మమ్మ తక్కువ చేస్తానా అనాథ శరణాలయాలు రెండు, వికలాంగ సెంటర్సు రెండూనూ -- బెనిఫిట్స్ అవీ పెడితే --

ఇహ చెప్పకండి .... పుణ్యం పురుషార్థం రెండూను. దేశ్సేవ రంగు వుంటుంది. పేపర్లలో ఫోటోలు ఫ్రీగా అచ్చేస్తారు. అన్నట్టు బావగారు అందరికీ ఇచ్చి మా మనవడిని వదిలేశారు. వయస్సు పదేళ్ళేగాని దేవాంతకబ్బుర్ర "తొందరపడకండి సార్ .... మాకూ వున్నారు మనవళ్ళు .... మాపార్టీకి మహిళా వింగు, యూత్ వింగూ వున్నట్టే రేపు బాలిండియావింగుని ఓపెన్ చేస్తున్నాం. మన వాళ్లకి ఎల్కేజీ యూకేజీ స్కూళ్ళు ఇచ్చేద్దాం ....

"స్కూళ్ళా!"అన్నాడు షావుగారు నీరసంగా.

"భలేవారే .... లైసెన్సు రావాలేగాని కాలేజీల కన్నా లాభసాటి .... రూల్సులూ బాదర బందీలూ తక్కువ. సీటుకి అయిదు నుంచి పదివేల దాకా పలుకుతుంది"

ఢాం! హచ్చా-! ...

వార్నీ ! ఇవా! నువ్వా!

అయ్యిగుర్రూజీ ఈ బాంబుల చప్పుడేమిటని భయపడకండి. నేనూ ఝడుసుకున్నాను గాని మరేం లేదు .... ఇందాకళో హాస్యకవిగారు సంచి నిండా సెటైర్లు పట్టుకొచ్చాడు నాకు వినిపిద్దామని. మన కబుర్లు వినగానే అవి ఢాం ఢాం మని పేలి పంచరై పోయాయి. కవిగారు గల్లంతై పోయాడు.

అయ్యా ఇప్పుడు చెప్పిన కట్నాల కథని తమరు రుజువు చేసి ప్రాసిక్యూట్ చేయగలిగ్తే - బోఫోర్సు సాల్వయినంత ఒట్టు.

స్కామ్ అనగా ఏమిటని డిఫైన్ చెయ్యడానికి నిఘంటువు వాళ్ళూ కమిటీల వాళ్ళూ గింజుకు పోతున్నారు.

"ఏ వుందిషా? నీ బాంకులో డబ్బు కాస్సేపు నా జేబులో వేసుకు ఢంకా పలాన. నాలుగాటలాడుకోడం -- అనక నీ వెధవ డబ్బు నీ మొహాన కొట్టడం" అని రంగున చెప్పేశారు రామప్పంతులుగారు.

* * *

నిజమేగాని శ్కామ్‌సుందరుల జోరు పెరిగాక అటు గవర్నమెంటు వారూ ఇటు రిజర్వు బ్యాంకు వారూ వారిని బట్టి తతిమా బ్యాంకుల వాళ్ళు కూడా రూల్సుని ఇనపకచ్చడాల్లా బిగించేశారు. చాలా ఖచ్చితంగా అమలు చేస్తున్నారు.

మొన్న ఒక రైతు బాంకీకి వెళ్ళి అయ్యా నా చేను పక్క దిగుడుబావికి పూడిక తీయించుకోవాలీ ఐదొందలు అప్పిస్తారా అని అడిగాట్ట.

బాంకు వాళ్ళంతా ఢామ్మని మూర్ఛపోయి లేచారు.

"నీకేవన్నా బుద్ధుందా బక్కరైతూ!? ఇలాటి దిక్కుమాలిన అప్పులిచ్చి దేశాన్ని అధోగతి పాలు చెయ్యొద్దని శ్రీ గవర్నమెంట్లూ పెద్ద బ్యాంకుల వాళ్ళూ తీవ్రంగా హెచ్చరించి రూల్సు బిగించి పారేశారు.... అంతగా నీకు అవసరమంటే ఓ పదివేల బావులు తవ్వు కోవాలని జెప్పి దరఖాస్తు పడేసి నాలుగైదు కోట్లు పట్టుకు పో.... దాన్ని గురించి నిన్నెవరైనా హన్నా అంటే ఆర్బీఐ మీద ఒట్టు" అని చెప్పారట.

* * *

ధ్వని అలంకారం లావుపాటి బొక్కల్లోనే వుంటుందనుకునేవాడిని. అది ప్రజల జీవితాల్లో చక్కగా చెలామణీ అయిపోతోంది. మొన్న మధురవాణి ఎరిగున్నపిల్లని ఓ రోమియో దగా చేసి దెబ్బ కొట్టాట్ట.

"ఆ పిల్లక్కడుపు జేశావట గదా ... కాదంటే ఎలా?" అని మధురవాణి నిలదీసి అడిగింది.

మహాప్రభో చీకట్లో ఎవడిని జూసి ఎవడనుకుందో -- నేను గాదు. నేనా పిల్ల మొహమే చూళ్ళేదు. చూస్తే మూర్ఛపోనుగదా అని బుకాయించాట్ట.

"నీ కింత మహలావు జ్ఞాపకశక్తి వుందే .... నేనూ నిన్నెరుగుదును. ఐదో యేట ఏం జరిగిందో చెప్పు" అంది మధురవాణి తమాషాకి.

వాడు తడుముకోకుండా ఐదో యేట, మూడో ఏట, ఆర్నెలప్పుడూ ఏవేం జరిగాయో పూసగుచ్చినట్టు చెప్పేశాట్ట.

అంతట మధురవాణి ఓ రస్నా వేసింది.

"ఆరోనెల సంగతులు సరే అంతకు 15 మాసాల క్రితం ఏం జరిగిందో చెప్పగలవా" అందిట....

వాడు "15 మాసాలా అదీ అదీ...." అంటూ కొంచెం బుర్రగోక్కున్నాడు.

అదేనయ్యా ఆ రోజున నువ్వు మీ నాన్నతో పొలాలకెళ్ళి మీ అమ్మతో ఇంటి కొచ్చావు అది గుర్తు లేదూ అంది.

ఓహో అదా .... బలేదానివే అవి గుర్తులేకేం. అవేళ పెద్ద గాలివాన కూడా అన్నాట్ట వాడు.

అదే అదే ఆ ధరిమేనా మా అమ్మా నాన్నా మళ్ళీ కలిసినట్టు లేదను. ఒకవేళ కనిపిస్తే వాళ్ళకి పెళ్ళి చెయ్యి. చేస్తే నాక్కబురు చెయ్యి. నాలుగక్షింతలు వేస్తాను అందిట.

నేనే గెలిచాను - గీ.